క్లుప్తంగా

ఏకగ్రీవంగా హమాలీ వర్కర్స్ యూనియన్

పీలేరు రూరల్ : పీలేరు హమాలీ వర్కర్స్ యూనియన్ (సీపీఐ అనుబంధం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా పి.వి. రమణ, సహాయ కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా దాము ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కొత్తగా ఎన్నికైన వారు యూనియన్ బలోపేతానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 27న పీలేరులో నిర్వహించనున్న నియోజకవర్గ సీపీఐ మహాసభలను ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు

పీలేరురూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపట్టారు. రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలతో బస్టాండ్ ప్రాంగణం మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో శనివారం డిపో మేనేజర్ నిర్మల పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. బస్టాండ్ ప్రాంగణంలో స్తంభించిన వర్షపునీరు వెళ్లేలా మురుగునీటి కాలువలు శుభ్రం చేపించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయలు, ఏడీసీలు బాబునాయక్, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

బి.కొత్తకోట: లయన్స్ క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ నూతన కార్యవర్గాన్ని శనివారం బి.కొత్తకోటలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా హరీష్, కోశాధికారిగా మనోజ్‌కుమార్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ చైర్మన్, ఏపీటీడీసీ మాజీ డైరెక్టర్ మిట్టపల్లి భాస్కర్‌రెడ్డి, మోహన్, భానుమూర్తి రెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెల్పింగ్‌మైండ్స్ సేవలు ప్రసంశనీయం

మదనపల్లె సిటీ: హెల్పింగ్‌మైండ్స్ సేవలు ప్రసంశనీయమని ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి అన్నారు. శనివారం బికె పల్లిలోని ,ఆనంద నిలయంలో హెల్పింగ్‌మైండ్స్ చేస్తున్న సేవలను గుర్తిస్తూ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్‌ను ఘనంగా సన్మానించారు. గత 13 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను కొనియాడారు. బూబకర్‌సిద్దిక్ మాట్లాడుతూ ఆనంద నిలయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆనందనిలయంలోని వృద్ధులకు అందిస్తున్న సేవలను కొనియాడారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు తీర్చాలి

–సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె: మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తున్న కార్మికులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ.రమణ మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. యూనిఫాం, కొబ్బరి నూనే, మాస్కులు, చెప్పులు, గ్లౌజ్‌లు తక్షణమే ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు వర్కర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేసి రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ నాయకులు కృష్ణమూర్తి, రామకృష్ణ, శ్రీరాములు,రామచంద్ర, లక్ష్మిదేవి, కృష్ణప్ప, రాజు, గోపాల్, అరవింద్, వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.

సమష్టి కృషితో అన్నదాన ట్రస్టు అభివృద్ధి

తంబళ్లపల్లె: సమష్టి కృషితోనే శ్రీ మల్లికార్జున స్వామి వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన ట్రస్టు) అభివృద్ధి సాధ్యమవుతుందని ట్రస్టు అధ్యక్షులు రాజశేఖరరెడ్డి తెలిపారు. శనివారం మల్లయ్యకొండ కింద అన్నదానట్రస్టు భవనంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ట్రస్టు అభివృద్ధికి దాతల సహకారం, చేపట్టిన పనులు, జరుగుతున్న పనులు, ఆర్థిక సహకారం, నిధుల సమీకరణ తదితర అంశాలపై చర్చించారు. కమిటీ సభ్యుల సూచనలు,సలహాలు తీసుకున్నారు. ప్రతి రెండు నెలలకు సమావేశం నిర్వహించి పనులు పారదర్శకంగా జరిగే విధంగా తీర్మానించి ఆమోదించారు. సమావేశంలో ట్రస్టు ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, దాత పుట్టా శేఖర్‌గుప్తా, రెడ్డప్పరెడ్డి, రామమూర్తి, మగ్గాల లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు చేయూత

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విభాగం, మిట్స్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లెలోని చైతన్య పౌండేషన్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శనివారం తెలిపారు. వంద మందికి బియ్యం బస్తాలు, నూనె ప్యాకెట్లు, నోట్‌బుక్స్, ఇతర నిత్యావసర సరుకులను అందజేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల ప్రత్యేకాధికారి కె.కృష్ణకిషోర్ అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెబుతాంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధించవచ్చునన్నారు. పట్టణ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, హోటళ్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందన్నారు. సమష్టి కృషితో దీన్ని అరికట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఏఎంసీ ఛైర్మన్ రామ్మూర్తి, ఈవో లతీఫ్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పీలేరు: ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


నిమ్మనపల్లె: పరిసరాల శుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పరిశుభ్రతలో భాగస్వామ్యులు కావాలి

నిమ్మనపల్లె : పరిసరాల శుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీడీఓ రమేష్ బాబు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, ఎంపీడీవో కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులు హై స్కూల్ విద్యార్థులతో కలిసి కందూర్ రోడ్ , బజారు వీధి మీదుగా బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం , వ్యాధుల వ్యాప్తి, తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్వచ్ఛ గ్రామాల సాధనలో భాగంగా ప్రజలు భాగస్వాములు అయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు స్థానికుల చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, ఏపీఓ రమేష్,పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

రామసముద్రం: రామసముద్రం గ్రామ పంచాయతీ కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఎంపీడీవో గఫూర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి దుకాణంకు వెళ్లి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మునస్వామి నాయక్, సచివాలయం సిబ్బంది, టీచర్లు, స్టూడెంట్, అంగన్వాడీ సిబ్బంది ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం వదులుదాం–స్వచ్ఛభారత్ వైపు అడుగువేదాం

కలకడ : ప్లాస్టిక్ భూతం వదులుదాం–స్వచ్ఛ భారత్‌వైపు అడుగువేదాం అని మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం కలకడలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని గ్రామ పురవీధులలో, చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూడురోడ్లు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, సర్పంచ్ ప్యారీజాన్, ఏపీఎం పురుషోత్తం రెడ్డి, పీహెచ్‌సి వైద్యాధికారులు, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై స్వచ్ఛ ఆంధ్ర

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై శనివారం అటవీశాఖ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అటవీశాఖ ప్రాంగణంలో పరిశుభ్రత చర్యలు చే పట్టి చెత్త చెదారం సేకరించి తరలించారు. ఘాట్‌రోడ్డు పక్కన ఉన్న గంగోత్రి చెరువు, దాని పరిసర ప్రాంత అడవిలో పర్యాటకులు వినియోగించి వదలేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, భోజనం చేసి వదిలేసిన వ్యర్థాలు, కాగితం వ్యర్థాలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. మదనపల్లె రేంజి పరిధిలోని అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు. రేంజర్ జయప్రసాదరావు, హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, షబీన్‌తాజ్, సుధాకర్, హార్సిలీహిల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవళికి బుద్ధుని బోధనలు అవసరం

మదనపల్లె: మానవళికి బుద్ధుని బోధనలు అవసరమని మాజీ ఎంపీ రెడ్డెప్ప, జనసేన రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, కర్ణాటక దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మునుస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి మదనపల్లెలో భారతీయ అంబేడ్కర్‌సేన, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన నిర్వహించారు. అర్థరాత్రి 12 గంటల దాక జరిగిన ఈ నాటిక సందర్భంగా హాజరైన అతిథులు బుద్ధుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు ప్రసంగిస్తూ బౌద్ధ దేశాలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయని అన్నారు. దేశంలో బౌద్ధం పునరుజ్జీవింపజేయడానికి అంబేడ్కర్ మార్గం చూపారన్నారు. బుద్ధుని జీవితం, బోధనలు, ధ్యానం, అహింస తత్వాలపై నాటకాన్ని చిత్రీకరించారన్నారు. నాటక సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు. బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ నాటకాన్ని ప్రదర్శింపజేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలిస్తున్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో రోజా హోటల్స్ నాగభూషణరెడ్డి, కవి పోతబోలు రెడ్డెప్ప, సంఘాల ప్రతినిధులు శ్రీచందు, మోహన్, కేవీ.రమణ, శ్రీనివాసులు, పీర్ బాషా, సుమిత్ర రమణ, ఆనందన్, రవిశంకర్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుని చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అన్నదాన ట్రస్టు అభివృద్ధికి సహకరిస్తా

– సుగవాసి బాలసుబ్రమణ్యం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన ట్రస్టు)కు అభివృద్ధికి సహకరిస్తానని వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం హామీ ఇచ్చారు. శనివారం అన్నదాన ట్రస్టు కమిటీ సభ్యులు రాయచోటిలోని ఆయన స్వగృహంలో శాలువతో సత్కరించారు. శ్రీ మల్లికార్జునస్వామి జ్ఞాపికను అందజేశారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండపై వైభవంగా మహాశివరాత్రి జరిగే తీరు, ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే అన్నదానంపై వివరించారు. ప్రస్తుతం వంటశాల షెడ్ల నిర్మాణం చేపట్టి జరుగుతున్న పనులకు తెలియజేశారు. త్వరలో మల్లయ్యకొండను సందర్శించి స్వామివారి సన్నిధిలో రూ. 10 లక్షల విరాళం అందిస్తానని చెప్పినట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట సభ్యులు నారాయణరెడ్డి, రెడ్డప్పరెడ్డి, పుట్టా శేఖర్‌గుప్తా, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామమూర్తి, కరీమ్ తదితరులు ఉన్నారు.


సుగవాసి బాలసుబ్రమణ్యంకు జ్ఞాపికను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉపాధి నైపుణ్యాలను పెంపొదించుకోవాలి

మదనపల్లె రూరల్ : ఉపాధి రంగాలకు అవసరమైన నైపుణ్యాలను యువత నేర్చుకున్నప్పుడే యువ సాధికారత సాధ్యమవుతుందని అటోస్ ప్రయాస్ ఫౌండేషన్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) టెక్నికల్ లీడర్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో బీకాం విద్యార్థులకు అటోస్ ప్రయాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ... ఉన్నత చదువులు చదివినా యువత ఉద్యోగం సాధించాలంటే సరైన నైపుణ్యాలు తప్పనిసరి అన్నారు. యువత విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఉపాధి రంగంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధి రంగాలకు అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉండటంతో యువతలో బలమైన ఆత్మగౌరవ భావన పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ-కామర్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్నెట్‌ను ఉపయోగించి వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడ నుంచైనా షాపింగ్ చేసేందుకు, విస్తృత శ్రేణి ఉత్పత్తులు, సేవలను సులభంగా పొందేందుకు ఈ కామర్స్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్.రమ్య, ట్రైనర్ భువనేశ్వరి పాల్గొన్నారు.


యువత సాధికారతపై అవగాహన కల్పిస్తున్న ఐసీటీ టెక్నికల్ లీడర్ దినేష్‌కుమార్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలి

మదనపల్లె: కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించి ప్రజలపై భారం తగ్గించాలని మదనపల్లెలో శనివారం జరిగిన వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీల నేతలు చర్చిస్తూ దీనిపై ప్రభుత్వం దిగిరాకుంటే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని అన్నారు. సెకీతో ఒప్పందం, ఆదానికి భూముల అప్పగింత చర్యలను చంద్రబాబు చేపట్టడం తగదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అదాని హబ్‌గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వదేశీ పరిశ్రమలను మూతవేయిస్తూ విదేశీ కంపెనీల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుతామని ప్రభుత్వం చెప్పడం మోసం చేయడమేనని అన్నారు. జెన్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేయకుండా అధిక ధరతో ప్రవేటు సంస్థల నుంచి కొనుగోలు చేస్తూ వినియోగదారుల నెత్తిన భారం మోపుతున్నారని అన్నారు. సెకీ ఒప్పందానికి వ్యతిరేకంగా ప్రస్తుత ఆర్థికమంత్రి గత ప్రభుత్వంపై కేసులు వేసిన విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్ బిగిస్తే పగులగొట్టండి అని చెప్పిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చాక మాట తప్పారని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయాభివృద్ధికి విరాళం

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్రావాంపల్లి సమీపం తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మితమవుతున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు దేశిరెడ్డి రవీంద్రనాథరెడ్డి, వీరకుమార్ రెడ్డిలు తమ వంతుగా రూ. లక్ష నగదును ఆలయ ధర్మకర్త సుధాకర్ రెడ్డికి అందజేశారు. హైవే రోడ్డు విస్తర్ణలో భాగంగా గతంలో వున్న ఆలయం తొలగించడంతో ప్రభుత్వం అందచేసిన ఆర్థిక సాయం, దాతల సాయంతో తిరిగి పునర్నిర్మాణం చేపట్టినట్లు ధర్మకర్త పేర్కొన్నారు. చింతల రమేష్‌కుమార్ రెడ్డి, కంభం మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

గుర్రంకొండ: నర్సరీల నిర్వహణ కోసం యజమానులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని మదనపల్లె ఉద్యానశాఖాధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా నర్సరీల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల లైసెన్స్ మూడు సంవత్సరాల కాల పరిమితి ముగిసిన వారు తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నర్సరీ చట్టాన్ని అనుసరించే నర్సరీలు నిర్వహించుకోవాల్సి ఉంటుందన్నారు. యజమాని విత్తన కొనుగోలు రిజిష్టర్, నారుమొక్కల పంపిణీ రిజిష్టర్, సస్య రక్షణ చర్యల రిజిష్టర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నారుమొక్కలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. నకిలీ నారుతో పంటనష్టపోయిన రైతులకు ఈ బిల్లులతో పంటనష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నర్సరీలు నిర్వహించేవారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాక వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. వీహెచ్‌వో అక్రమ్, నర్సరీల యజమానులు పాల్గొన్నారు.


నర్సరీ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్న ఉద్యానశాఖాధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

పశుసంవర్ధకశాఖ సేవలను చేరువ చేస్తాం

– వెటర్నరీ డీడీ డాక్టర్.జి.శ్రీనివాస్ నాయుడు

మదనపల్లె రూరల్ : పశు సంవర్ధకశాఖ సేవలను పాడిరైతులకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని మదనపల్లె డివిజనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్.శ్రీనివాస నాయుడు తెలిపారు. శనివారం స్థానిక పశుసంవర్ధకశాఖ డివిజనల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీడీగా శ్రీనివాసనాయుడు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీడీగా పనిచేస్తున్న నీరజను తిరిగి ఏడీగా కొనసాగిస్తూ, ఆమె స్థానంలో సోమల ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాసనాయుడును ఇన్‌చార్జ్ డీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద రైతులకు రాయితీపై అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 75శాతం సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలు అందిస్తున్నామని, 50 శాతం రాయితీతో పశువుల దాణా ఇవ్వడంతో పాటు లింగ నిర్ధారణ వీర్యాన్ని ఉపయోగించి పేయదూడలు మాత్రమే పుట్టే విధంగా ఇంజక్షన్లు వేస్తున్నామన్నారు. మదనపల్లె పశుసంవర్ధకశాఖ డివిజన్ పరిధిలోని సచివాలయ స్థాయిలో పశుసంవర్ధక సహాయకులు పాడిరైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఇన్‌చార్జ్ డీడీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ నాయుడును, జనసేన రాయలసీమ కో కన్వీనర్ రామదాస్‌చౌదరి, పట్టణానికి చెందిన బలిజసంఘ నాయకులు బీపీఎల్.విజయ్‌కుమార్, రాజ్‌భవన్ రాజా, శ్రీరామ రామాంజనేయులు, విజయలక్ష్మీ భాస్కర్, పెట్రోల్‌బంకు సూరి తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.


వెటర్నరీ ఇన్‌చార్జ్ డీడీ శ్రీనివాస్ నాయుడును అభినందిస్తున్న బలిజసంఘ నాయకులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లెలో పోస్టర్లను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, ఎనర్జీ అసిస్టెంట్లకు జేఎల్ఎం పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ వేతన బకాయిలు మొత్తం ఒకేసారి చెల్లించాలని, ఒప్పంద కార్మికులను సంస్థలో విలీనం చేసిన నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఇలా అన్ని విభాగాలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చే స్తున్నట్టు చెప్పారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ముక్తియార్, ముబారక్, గోపినాథ్, రాంమోహన్ నాయక్, వినోద్ నాయక్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు

మదనపల్లె సిటీ: కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు వచ్చినట్లు ప్రొఫెసర్ డాక్టర్ విరాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో జనరేటింగ్ ఏఐతో ప్రోగ్రామింగ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఏఐ ద్వారా సమయాన్ని ఆదా చేయవచ్చునన్నారు. ఏఐని ఆచరణాత్మకంగా పరిచయం చేయడం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులను సన్నద్ధం చేయడం కోసం సెమినార్ ముఖ్య లక్ష్యమన్నారు. విద్యాభ్యాసం, పరిశోధన జనరేటివ్ ఏఐని చేర్చవలసిన కీలకమైన అవసరాన్ని వివరించారు. జీపిటీ, డెల్–ఈ,ఇతర ప్రాథమిక ఏఐ నమూనాలు వంటి సాధనాలు, కంటెంట్ సృష్టి, ఆటోమేషన్, విద్యా, పరిశ్రమల అనువర్తనాలను ఎలా మారుస్తున్నాయో తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, కరస్పాడెంట్ రామమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పెయ్యల రాయుడు, కో ఆర్డినేటర్ మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ విరాజ్‌కుమార్

శ్రీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


తరిగొండలో స్వామివారికి పూజలు

లేని లిక్కర్ స్కామ్‌లో మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం


చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచద్రారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి కక్ష సాధింపు రాజకీయాలే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే ఆ కుటుంబంపై ఎదోరకంగా అక్రమ కేసులు పెడుతూ కక్ష సాధించడం శోచనీయమన్నారు. కక్ష పూరితంగా ప్రస్తుతం ఎంపీ మిథున్ రెడ్డిపై లిక్కర్ కేసులో ఇరికించారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అమలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, వైఎస్సార్‌సీపీ కీలక నేతగా ఉన్నందుకే ఎంపీని అరెస్టు చేయడానికే కూటమి ప్రభుత్వం కుట్రపన్నిందన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిపై ఎన్ని కేసులు బనాయించినా, మేలిమి ముత్యంలా బయటపడతారని ధీమా వ్యక్తం చేశారు.

మిథున్‌రెడ్డిపై మద్యం కేసు రాజకీయ కుట్ర


దేవిరెడ్డి పద్మజారెడ్డి

కురబలకోట: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై కక్ష సాధింపులో భాగంగానే తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని రెడ్డి కమ్యూనిటీ సొసైటీ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి పద్మజారెడ్డి విమర్శించారు. శనివారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గ నాయకులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజాపై కూడా అక్కడి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రెడ్డి విచక్షణ కోల్పోయి మహిళ అని కూడా చూడకుండా వెటకారంగా మాట్లాడడం విచారకరమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిపై ఆధారాలు లేకుండా ఉద్దేశ్యపూర్వకంగా కేసు నమోదు చేయడాన్ని జనం గమనిస్తున్నారన్నారు. జగన్‌కు సన్నిహితంగా ఉంటూ వస్తున్న కీలక నాయకులపై సీఎం చంద్రబాబు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారన్నారు. మిథున్‌రెడ్డి స్వచ్ఛందంగా సిట్ విచారణకు హాజరై హుందాతనాన్ని చాటుకున్నారన్నారు.

కక్ష పూరిత రాయకీయాలు చంద్రబాబుకు తగదు

– డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్

కలికిరి: సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కక్ష పూరిత రాజకీయాలు చేయడం తగదని రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని మహల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయంగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని దెబ్బతీయడంలో భాగాంగా రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డిపై ఏలాంటి ఆరోపణలు లేక పోయినా అక్రమ లిక్కర్ కేసులో ఇరికించి అరెస్టు చేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతంలో మిథున్ రెడ్డి పాత్రలను చూసి ఓర్వలేకనే ఇలా ఆయనపై అక్రమ కేసులు బాయిస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న వారిపై కేసులు మోపి చంద్రబాబు రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక కేసుల్లో బెయిల్‌పై ఉన్న సీఎం చంద్రబాబు కేసుల దర్యాప్తును నీరుగార్చి.. వైఎస్సార్‌సీపీ నేతలపై వరుసగా అక్రమ కేసులు పెట్టి రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని నిందలు మోపినా, అక్రమ కేసులు బనాయించినా తమ నేత ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలో వాటి నుంచి బయటపడతారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు రిజాయ్ అహ్మద్ ఖాన్, జహీద్, అన్సర్, సైయ్యద్ అలీ, ఆసిఫ్, జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

రెడ్లపై కూటమిప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు

మదనపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వంలో రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, పరుష పదజాలంతో దూషిస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని రెడ్డి కమ్యూనిటీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి పద్మజారెడ్డి అన్నారు. శనివారం స్థానిక రెడ్డి కమ్యూనిటీ సొసైటీ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... కూటమిప్రభుత్వం ఏడాదిపాలనలో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయకపోగా రాష్ట్రంలో ఉన్నటువంటి రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వారి మనోభావాలు దెబ్బతినేలా నాయకులు దూషణలు చేస్తున్నారన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్..విచక్షణ కోల్పోయి, మహిళ అని చూడకుండా సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా మాజీ మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. జాతీయ కన్వీనర్ వెంగల్ రెడ్డి, రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ ఎర్రగుంట్ల పద్మ ప్రియారెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిశేఖరరెడ్డి సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: ఎన్ఆర్ఐ చింతల రెడ్డిశేఖర్‌రెడ్డి పాఠశాల అభివృద్ధి అందిస్తున్న చేయూత ప్రశంసనీయమని సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమెరికాకు చెందిన రెడ్డిశేఖర్‌రెడ్డి వారి తల్లిదండ్రుల పేరుతో చింతల పెద్దిరెడ్డి, రెడ్డమ్మల జ్ఞాపకార్థం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.3 లక్షల ప్రోత్సాహక బహుమతులు, రూ.25 వేలతో క్రీడాపరికరాలను అందజేశారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్,శివారెడ్డి, గిరిధర్‌నాయక్, నాగరాజు. నరేష్ పాల్గొన్నారు.